క్లుప్తంగా

భవానీశంకరునికి ప్రత్యేక పూజలు



మధురానగర్(విజయవాడసెంట్రల్): ముత్యాలంపాడు శ్రీషిర్డీ సాయిబాబా మందిరంలోని మరకత పోలిక శ్రీభవానీ శంకర స్వామివారికి మంగళవారం విశేషంగా విరజాజులతో అర్చన నిర్వహించారు. ఇక్కడ స్వామివారికి స్వయంగా అభిషేకం చేసుకునే అవకాశం ఉండటంతో పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయానికి చేరుకుని భక్తిశ్రద్ధలతో అభిషేకాలు నిర్వహించారు. ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. మధ్యాహ్నం అన్న ప్రసాద వితరణ జరిగింది. కార్యక్రమాలను ఆలయ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

బహుముఖ ప్రతిభాశాలి దాశరథి



విజయవాడ కల్చరల్: బహుముఖ ప్రతిభాశాలి దాశరథి కృష్ణామాచార్యులు అని తెలుగు కళావాహిని అధ్యక్షుడు చింతకాయల చిట్టిబాబు పేర్కొన్నారు. నగర సాంస్కృతిక సాహిత్య కళావేదిక ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని సంస్థ కార్యాలయంలో దాశరథి శతజయంతి వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిట్టిబాబు మాట్లాడుతూ తెలంగాణా సాయిధ పోరాటంలో దాశరథి పాత్ర వెలకట్టలేనిదని అన్నారు. విశ్రాంత పోలీస్ అధికారి కే డేవిడ్‌రాజు మాట్లాడుతూ దాశరథి పాటల రేడు అని.. అవి తెలుగు సాహితీ వైభవానికి తీపి గురుతులని పేర్కొన్నారు. అతిథులు దాశరథి చిత్రపటానికి నివాళులు సమర్పించారు. గాయనీ గాయకులు దాశరథి చిత్ర గీతాలను ఆలపించారు. కార్యక్రమంలో కే వెంకటేశ్వరరెడ్డి, కందుకూరి రవిబాబు, ఆర్ మధుసూధనరావు, మారేపల్లి జోషి తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

మధురానగర్(విజయవాడసెంట్రల్): మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం ఉదయం 10 గంటలకు కళాశాల ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యాన ఉచిత కంటి, దంత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ కే భాగ్యలక్ష్మి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. శిబిరంలో ప్రముఖ వైద్యులు బీపీ, షుగర్, కొలెస్ట్రాల్, కంటి, దంత పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు.

ఆకట్టుకున్న 'బుద్ధునితో నా ప్రయాణం'



విజయవాడ కల్చరల్: ముమ్మనేని సుబ్బారావు సిద్ధార్థ కళాపీఠం, ది బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా, కామ్రేడ్ జీఆర్కే పోలవరపు సాహితీ సమితి, అభ్యుదయ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో మొగల్రాజపురంలోని పీబీ సిద్ధార్థ కళాపీఠం వేదికపై మంగళవారం ప్రదర్శించిన 'బుద్ధునితో నా ప్రయాణం' ఆకట్టుకుంది. దాదాపు రెండు వేల ఐదు వందల సంవత్సరాల క్రితం బుద్ధుడు ప్రతిపాదించిన జీవన విధానం నేటికీ స్ఫూర్తిదాయకమే, గౌతముడు సిద్ధార్థునిగా మారడం, సమాజంలో ప్రయాణం చేయడం, ఆయన బోధనలు, బుద్ధుని త్రిపీటకాలు, అష్టాంగమార్గం, అహింసా మార్గం ప్రధాన అంశాలుగా నాటకం సాగింది. చివరిగా బుద్ధుని బోధనలకు ప్రభావితుడైన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ప్రజలు, అభిమానుల సమక్షంలో బౌద్ధం స్వీకరించడంతో నాటకం ముగుస్తుంది. నాటక రచయిత బీఆర్ అంబేడ్కర్. బుద్ధునిగా ఆనంద్, అంబేడ్కర్‌గా గోపి, సిద్ధార్థునిగా అఖిల్, యశోధరగా రెహానా, రాహుల్‌లుగా సాయి తదితరులు నటించారు. ముఖ్య అతిథిగా గోళ్ళ నారాయణరావు పాల్గొన్నారు.

విజయవాడ డివిజన్ సమస్యలు పరిష్కరించండి

రైల్వే బోర్డ్ చైర్మన్ సతీష్‌కుమార్‌కు ఎంపీ చిన్ని వినతి

సాక్షి, న్యూఢిల్లీ: విజయవాడ రైల్వే డివిజన్ సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని రైల్వే బోర్డ్ చైర్మన్ సతీష్‌కుమార్‌ను విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని) కోరారు. ఢిల్లీలో మంగళవారం ఎంపీ చిన్ని సతీష్ కుమార్‌ను కలిసి పలు సమస్యలపై వినతి పత్రాన్ని అందజేశారు. 'విజయవాడ రైల్వే డివిజన్‌లో పెండింగ్‌లో ఉన్న లెవెల్ క్రాసింగ్ నంబర్ 316(విజయవాడ – గుణదల), లెవెల్ క్రాసింగ్ 147(రాయనపాడు – కొండపల్లి), లెవెల్ క్రాసింగ్ 148(విజయవాడ – రాయనపాడు), లెవెల్ క్రాసింగ్ నంబర్ 8(విజయవాడ – రామవరప్పాడు), వద్ద రోడ్ ఓవర్ బ్రిడ్జిలు(ఆర్ఓబీ), రోడ్ అండర్ బ్రిడ్జిలు (ఆర్‌యూబీ) నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేసేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే అమృత భారత స్టేషన్ 2.0 పథకం కింద విజయవాడ రైల్వే స్టేషన్ అభివృద్ధికి నీతి ఆయోగ్ మంజూరు చేసిన రూ.836.47 కోట్ల నిధులను రైల్వే శాఖ త్వరగా విడుదల చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఎంపీ చిన్ని కోరారు.

మైదానాన్ని తలపిస్తున్న పార్కు

- నిరుపయోగంగా సత్యనారాయణపురం రైల్వే పార్కు
- నిర్వహణను పట్టించుకోని రైల్వే అధికారులు
- అసాంఘిక శక్తులకు అడ్డాగా మారిన వైనం



సత్యనారాయణపురంలోని రైల్వే పార్కు

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): నగరంలోని సత్యనారాయణపురం రైల్వే కాలనీ విజయవాడ డివిజన్‌లోనే ఎంతో ప్రఖ్యాతి చెందినది. కాలనీవాసుల ఉపయోగార్థం రైల్వేశాఖ బీఆర్టీఎస్ రోడ్డు సమీపంలోని ఈటీటీసీ పక్కన ఏర్పాటు చేసిన 'రైలు పార్కు' కాలనీవాసులకు ఉపయోగపడకపోగా అసాంఘిక శక్తులకు అడ్డాగా మారింది. పార్కు ప్రారంభంలో ఏర్పాటు చేసిన శిలాఫలకం మీద చూస్తే తప్ప ఇది పార్కు అని చెప్పే ఒక్క ఆనవాలు కూడా ఇక్కడ కనిపించపోవడం విశేషం. ఈ పార్కు నిర్వహణ పట్ల రైల్వే అధికారులు ఏ మాత్రం శ్రద్ధ చూపడం లేదని అర్థం అవుతుంది.

పార్కులో పచ్చదనం కరువు

గతంలో పచ్చని చెట్లు, ఆహ్లాదకర వాతావరణంలో ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు ఉదయం పార్కుకు చేరుకుని వాకింగ్ చేసుకునేవారు. సాయంత్రం మహిళలు, వృద్ధులు పిల్లలతో పార్కులోని ఆట పరికరాలతో ఆడుతూ ఆహ్లాదబరితంగా సేదతీరేవారు. ప్రస్తుతం పార్కులో ఆ పరిస్థితి ఎక్కడా కనిపించదు. దెబ్బతిన్న వాకింగ్ ట్రాక్, ఎటు చూసినా ఎండిపోయి నేలకొరిగిన వృక్షాలు, మొక్కలతో మైదానాన్ని తలపించేలా ఉంది. కనీసం కూర్చునేందుకు సదుపాయాలు ఉండవు. పిల్లల ఆట పరికరాలైతే మచ్చుకైనా కనిపిండవు.

పార్కు అభివృద్ధి చర్యలు నిల్

జూన్ 20, 2015వ సంవత్సరంలో అప్పటి దక్షిణ మధ్య రైల్వే జీఎం పీకే శ్రీవస్తవ చేతుల మీదుగా సకల సదుపాయాలతో ఈ రైలు పార్కు ప్రారంభోత్సవం జరిగింది. పచ్చని చెట్లు, సేద తీరేందుకు సిమెంట్ బల్లలు, పిల్లలు ఆడుకునేందుకు ఆటపరికరాలు, ఉద్యోగులు, మహిళలు, వృద్ధుల కోసం వాకింగ్ ట్రాక్, విద్యుత్ లైట్ల వెలుగులో రైల్వే పార్కు చక్కటి ఆహ్లాదాన్ని కాలనీవాసులకు అందించేంది. క్రమేణా విజయవాడ డివిజన్ అధికారులు పార్కు నిర్వహణను పక్కన పెట్టడంతో పార్కు కాస్తా అసాంఘిక శక్తులకు అడ్డాగా మారింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి మౌలిక సదుపాయాలతో పార్కుకు పూర్వవైభవం తీసుకువచ్చి కాలనీ వాసులకు ఉపయోగపడేలా చూడాలని వారు కోరుతున్నారు.

ఎటు చూసినా వ్యర్థాలే

సత్యనారాయణపురంలోని రైలు పార్కులో అసాంఘిక కార్యక్రమాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. పార్కులో ఎక్కడ చూసినా తాగి పడేసిన మద్యం సీసాలు, వాటర్ ప్యాకెట్లు, బాటిళ్లు గుట్టలుగా దర్శనమిస్తున్నాయి. బీఆర్టీఎస్ రోడ్డుకు అనుకుని ఉండటంతో బయట నుంచి ఆకతాయిలు, మందు బాబులు రాత్రుళ్లు తమ వాహనాలతో పార్కుకు చేరుకుని మద్యం, గంజాయి సేవిస్తూ అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారు. ఇటు ఆర్పీఎఫ్ గాని, అటు జిల్లా పోలీసులు గాని వీరిపై దృష్టి పెట్టకపోవడంతో వారి ఆకృత్యాలకు అడ్డు, అదుపు లేకుండా పోతుందని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



వ్యర్థాలతో నిండిపోయిన పార్కు



ఎండిపోయిన చెట్లు, మొక్కలతో మైదానంలా మారిన రైల్వే పార్కు



పూర్తిగా దెబ్బతిన్న వాకింగ్ ట్రాక్

వ్యభిచార గృహం నిర్వాహకురాలిని శిక్షించాలి



రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న రమాదేవి తదితరులు

కృష్ణలంక(విజయవాడతూర్పు): కాకినాడ జిల్లా, పెద్దాపురంలో వ్యభిచార గృహం నిర్వాహకురాలు భారతిని అరెస్ట్ చేసి శిక్షించాలని అత్యాచార వ్యతిరేక పోరాట వేదిక డిమాండ్ చేసింది. గవర్నర్‌పేటలోని బాలోత్సవ భవన్‌లో అత్యాచార వ్యతిరేక పోరాట వేదిక ఆధ్వర్యంలో మంగళవారం పెద్దాపురం బాధిత మహిళలకు రక్షణ కల్పించాలి–సెక్స్ వ్యాపారులపై చర్యలు తీసుకోవాలి అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన విలేకరుల సమావేశంలో ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.రమాదేవి మాట్లాడుతూ.. పెద్దాపురంలో స్థానిక పోలీస్ అధికారుల ప్రమేయంతో ఈ కార్యకలాపాలు యథేచ్ఛగా జరుగుతున్నాయన్నారు. సామాజిక కార్యకర్త వసుంధర మాట్లాడుతూ.. నిందితురాలైన భారతిని తక్షణం అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఆమెకు సహకరించిన కానిస్టేబుల్, హోమ్ గార్డులపై కూడా చర్యలు తీసుకోవాలని కోరారు. తనకు న్యాయం చేయాలని బాధితురాలు డిమాండ్ చేశారు. సమావేశంలో అత్యాచార వ్యతిరేక పోరాట వేదిక నాయకులు గంగాభవాని, పద్మ, రాణి, మాల్యాద్రి, దివ్య, సయ్యద్ బేగం, లక్ష్మీ ప్రసన్న, స్వరూపారాణి,శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

యూబీఐ - హెచ్‌ఆర్ వాకథాన్



బీఆర్టీఎస్ రోడ్డులో వాకథాన్ నిర్వహిస్తున్న సిబ్బంది

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించడంలో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎప్పుడూ ముందు వరుసలో ఉంటుందని యూనియన్ బ్యాంక్ జోనల్ హెడ్ సీవీఎన్ భాస్కరరావు, రీజినల్ హెడ్ ఎంవీ తిలక్ పేర్కొన్నారు. బీఆర్టీఎస్ రోడ్డులో మంగళవారం యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (యూబీఐ) రీజనల్, జోనల్ కార్యాలయం సంయుక్త ఆధ్వర్యాన హెచ్‌ఆర్ వీక్ – 2025 సందర్భంగా వాకథాన్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా జిల్లాలో 73 బ్రాంచులు, 699 మంది సిబ్బందితో లీడ్ బ్యాంక్‌గా సమర్థవంతంగా బ్యాంకింగ్ సేవలందిస్తోందని తెలిపారు. బ్యాంకింగ్ సేవలు, పథకాలపై అవగాహన కల్పించే విధంగా వాక్‌థాన్ నిర్వహిస్తున్నామని చెప్పారు. బ్యాంక్ సేవలు, పథకాలను ఖాతాదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం శారదా కళాశాల నుంచి యూనియన్ బ్యాంక్ సిబ్బంది బ్యాంకు ప్రాముఖ్యత పథకాలను వివరిస్తూ వాక్‌థాన్‌లో ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమంలో యూనియన్ బ్యాంక్ ఉన్నతాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్లపై నిలిచిన వర్షంనీరు



పసుపుతోటలో రోడ్డుపై నిలిచిన వర్షంనీరు



డీమార్ట్ సమీపంలో కదలని వర్షంనీరు

మధురానగర్(విజయవాడసెంట్రల్): నగరంలో కురుస్తున్న వర్షాలకు రోడ్లు జలమయం అయ్యాయి. నిత్యం రద్దీగా ఉండే సాంబమూర్తి రోడ్డు డీమార్ట్ సమీపంలోనూ, పసుపుతోట వాటర్ ట్యాంక్, మాచవరం, దుర్గాపురం తదితర ప్రాంతాల్లో వర్షంనీరు బయటకు వెళ్లే మార్గం లేక రోడ్లపైనే నిలిచిపోయింది. దీంతో రాకపోకలకు వాహనచోదకులు, పాదచారులు అవస్థలు పడుతున్నారు. అలాగే జీవీఆర్‌నగర్, దావు బుచ్చయ్యకాలనీ, వినాయకనగర్ తదితర ప్రాంతాల్లోని ఖాళీస్థలాలు చెరువులను తలపిస్తున్నాయి.

జనజీవనం అస్తవ్యస్తం

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడ సెంట్రల్): సింగ్‌నగర్, పాయకాపురం పరిసర ప్రాంతాల్లో మంగళవారం సాయంత్రం భారీ వర్షం పడింది. కొన్ని ప్రధాన కూడళ్లు, రహదారులపై వర్షంనీరు నిలిచిపోవడంతో స్థానిక ప్రజలు రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వచ్చింది. సరిగ్గా పాఠశాలలు, కళాశాలలు వదిలిన సమయానికి వర్షం పడటంతో విద్యార్థులు వానలో తడిచిపోయారు. రోడ్డుపై తమకు కనిపించిన బియ్యం సంచులు, కవర్లు, బెండు ముక్కలను అడ్డుపెట్టుకొని ఇళ్లకు వెళ్లారు. ఓ వైపు జోరు వాన.. మరోవైపు రోడ్లపై నిలిచిపోయిన నీటిలో నడిచేందుకు అవస్థలు ఎదుర్కొన్నారు.



బెండు ముక్క సాయంతో ఇంటికి వెళ్తున్న విద్యార్థులు

నందీశ్వరునికి రుద్రాభిషేకం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పాతబస్తీలోని పురాతన ఆలయమైన పాత శివాలయంలో నందీశ్వరునికి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాన్ని మంగళవారం నిర్వహించారు. నగరంలోని శ్రీభ్రమరాంబ మల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానం (పాతశివాలయం)లో త్రయోదశిని పురస్కరించుకొని ప్రత్యేక వైదిక కార్యక్రమాలను నిర్వహించారు. ప్రతి మాసంలోనూ త్రయోదశి రోజున నందీశ్వరునికి ప్రత్యేక అభిషేకాలను నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది.

మాన్సూన్ రెస్పాన్స్ టీమ్‌ను ఏర్పాటు చేయాలి

వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర



వర్షం నీరు తొలగింపుపై అధికారులకు సూచనలిస్తున్న కమిషనర్ ధ్యానచంద్ర

భవానీపురం(విజయవాడపశ్చిమ): వర్షం నీరు రోడ్డుపై నిలవకుండా మాన్సూన్ రెస్పాన్స్ టీమ్‌ను ఏర్పాటు చేయాలని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు. బెంజిసర్కిల్, నిర్మలా కాన్వెంట్ రోడ్, పోస్టల్ కాలనీ రోడ్, పంట కాలువ రోడ్, ఏపీఐఐసీ కాలనీ, ఆయుష్ హాస్పటల్ రోడ్, రామవరప్పాడు జంక్షన్, ఏలూరు రోడ్, గుణదల సెంటర్ ప్రాంతాలలో మంగళవారం సాయంత్రం ఆయన పర్యటించారు.

ఆక్రమణలను తొలగించాలి..

ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఒక ఎనిమిటీ, శానిటరీ, ప్లానింగ్ సెక్రటరీలతో కూడిన మాన్సూన్ రెస్పాన్స్ బృందాన్ని ఏర్పాటు చేయాలన్నారు. నగరంలో గుర్తించిన స్టాగ్నేషన్ పాయింట్లలో ఒక్కో పాయింట్‌కు ఒక బృందాన్ని ఏర్పాటు చేసి వర్షపు నీరు రోడ్లపై నిలవకుండా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. అవసరమైతే మోటార్ల సామర్థ్యతను పెంచి వర్షపు నీరు ఎక్కువగా నిలవ ఉండే ప్రాంతాల్లో 10 నిమిషాల కంటే ఎక్కువ సేపు నిలవ ఉండకుండా చూడాలన్నారు. వర్షపు నీరు ప్రవాహానికి అడ్డొచ్చే ఆక్రమణలను తొలగించాలని ప్లానింగ్ అధికారులను ఆదేశించారు. అలాగే నగరంలో గుర్తించిన రిహాబిలిటేషన్ సెంటర్లలో ఎటువంటి మరమ్మతులు లేకుండా కనీస వసతులను కల్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. పర్యటనలో అడిషనల్ కమిషనర్(ప్రాజెక్ట్స్) డాక్టర్ డి.చంద్రశేఖర్, జోనల్ కమిషనర్ కె.షమ్మీ, చీఫ్ ఇంజినీర్ ఆర్.శ్రీనాథ్‌రెడ్డి, చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కె.అర్జునరావు, చీఫ్ సిటీ ప్లానర్ సంజయ్ రత్నకుమార్, పర్యవేక్షణ ఇంజినీర్లు పి.సత్యకుమారి, పి.సత్యనారాయణ, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జి.సామ్రాజ్యం, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ గోపాలకృష్ణ నాయక్ పాల్గొన్నారు.

పద్యనాటక వైభవాన్ని చాటిన 'సత్యహరిశ్చంద్ర'



సత్యహరిశ్చంద్ర నాటకంలో ఓ సన్నివేశం

విజయవాడ కల్చరల్: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం భాషా సాంస్కృతిక శాఖ, సృజనాత్మక సమితి సహకారంతో విజయదుర్గా నాట్యమండలి ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా గాంధీనగర్‌లోని కౌతాపూర్ణానందం కళావేదికపై మంగళవారం ప్రదర్శించిన సత్యహరిశ్చంద్ర నాటకం పద్యనాటక వైభవాన్ని చాటింది. బలిజేపల్లి లక్ష్మీకాంతం రచించిన నాటకంలో కవి జాషువా పద్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. హరిశ్చంద్రునిగా ఏటీ నాయుడు, విశ్వామిత్రునిగా కేవీ రమణారావు, చంద్రమతిగా ఎం రమణి, లోహితాశ్యునిగా చింతా ప్రణవసాయి పాత్రోచితంగా నటించారు. నాటక రంగ ప్రముఖుడు అగురు త్రినాథ్ నాయుడు మాట్లాడుతూ పద్యనాటకాల్లో సత్యహరిశ్చంద్ర నాటకం మకుటాయమానమైనదని అన్నారు. గుమ్మడి జయరాజు మాట్లాడుతూ పద్యనాటకానికి పూర్వవైభవం తీసుకురావాలని సూచించారు. విజయదుర్గా నాట్యమండలి వ్యవస్థాపక అధ్యక్షుడు బోత్సా సూర్యనారాయణ పాల్గొన్నారు.

అగ్రిగోల్డ్ భూముల పరిశీలన



గాంధీనగర్‌లో ప్రభుత్వం అటాచ్ చేసిన అగ్రిగోల్డ్ భూమిని పరిశీలిస్తున్న ఆర్డీఓ చైతన్య

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): అగ్రిగోల్డ్‌కు సంబంధించి ప్రభుత్వం అటాచ్ చేసిన భూములను క్షేత్రస్థాయిలో పరిశీలించి నివేదికను రూపొందించడం జరిగిందని విజయవాడ ఆర్డీవో కె. చైతన్య తెలిపారు. రాష్ట్ర భూపరిపాలన శాఖ, కలెక్టర్ ఆదేశాలతో జిల్లాలో మంగళవారం అగ్రిగోల్డ్ భూముల ఫిజికల్ వెరిఫికేషన్ ప్రక్రియను చేపట్టారు. దీనిలో భాగంగా రెవెన్యూ, నగరపాలక సంస్థ, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్ తదితర విభాగాలకు చెందిన జిల్లా స్థాయి కమిటీ, సీఐడీ డీఎస్పీ పి.శ్రీనివాస్, విజయవాడ ఆర్డీవో కె.చైతన్యలు గాంధీనగర్‌లోని జయరాం థియేటర్ సమీపంలో అగ్రిగోల్డ్‌కు సంబంధించి ప్రభుత్వం అటాచ్ చేసిన భూమిని పరిశీలించారు. సంబంధిత భూమిని రీ సర్వే, భౌతిక పరిశీలన నిర్వహించారు. అగ్రిగోల్డ్‌కు సంబంధించిన భూమి విలువతోపాటు మార్కెట్ విలువను కూడా లెక్కించి జిల్లా రిజిస్ట్రార్ సహకారంతో వివరాలను నివేదికలో పొందుపరచడం జరుగుతుందని చెప్పారు. ఆయా భూముల ప్రభుత్వ విలువ సంబంధిత సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం నుంచి, మార్కెట్ విలువను అధికారిక ఏజెన్సీ నుంచి పొంది మ్యుటేషన్ పనులు పూర్తిచేయడం జరుగుతుందని ఆర్డీవో చైతన్య పేర్కొన్నారు.

26 మంది మందుబాబులకు జరిమానా

లబ్బీపేట(విజయవాడతూర్పు): నగరంలోని 5వ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో నిర్వహించిన తనిఖీల్లో మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న 26 మందిని గుర్తించి వారిపై కేసులు నమోదు చేశారు. అనంతరం వారిని 6వ అడిషనల్ జ్యూడిషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టులో హాజరు పర్చగా న్యాయమూర్తి లెనిన్‌బాబు వారికి జరిమానాలు విధించారు. వారిలో ఆరుగురికి ఒక్కొక్కరికీ రూ.15 వేలు చొప్పున, మిగిలిన 20 మందికి రూ.10 వేలు చొప్పున జరిమానాలు విధించారు. ప్రతి రోజూ నగరంలో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహిస్తున్నామని, ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సీపీ ఎస్వీ రాజశేఖరబాబు చెప్పారు.

చెత్తతో సహవాసం



కృష్ణాహోటల్ సెంటర్ నుంచి నూజివీడు రోడ్డుకు వెళ్లే బస్‌రూట్‌లో చెత్తచెదారం

- చెత్త, మురుగుతో దర్శనమిస్తున్న సింగ్‌నగర్‌లోని ప్రధాన రహదారులు
- దుర్వాసన, దోమలతో జనం గగ్గోలు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): ఏ ఇంటి ముందుకు వెళ్లినా చెత్తా, చెదారాలు.. ఏ రోడ్డుకు వెళ్లిన వర్షంనీటికి తోడుగా ప్రవహిస్తున్న మురుగునీరు. ఆరుబయట కాదు కదా ఇళ్లల్లో కూడా ఉండనీయని తీవ్ర దుర్వాసన, దోమలు, ఈగలతో ప్రజలు అల్లాడిపోతున్నారు.

అధ్వానంగా వీధులు

సింగ్‌నగర్, న్యూరాజరాజేశ్వరీపేట, నందమూరి నగర్, వాంబేకాలనీ పరిసర ప్రాంతాల్లోని ప్రధాన రహదారులన్నీ 'చెత్త మయం'గా మారాయి. దాదాపు పది రోజుల నుంచి తమ నివాసాల ముందు చెత్త, కాలువల్లో మురుగు తీసే నాథుడు లేకపోవడంతో వాటి నుంచి వస్తున్న దుర్వాసనలు, దోమలు, ఈగల వల్ల తాము అస్సలు ఇళ్లల్లో ఉండలేకపోతున్నామంటూ స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మూలిగే నక్కపై తాటికాయ పడిన చందంగా అసలే చెత్తా, చెదారాలతో రోడ్లన్నీ నిండిపోయి ఉంటే వీటికి తోడుగా గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలు ప్రజలను మరిన్ని ఇబ్బందులకు గురిచేస్తున్నాయి.

కన్నీళ్లు తెప్పిస్తున్న యూజీడీ లీకులు

అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీల మ్యాన్‌హోల్స్ నిండి అనేక చోట్ల ఆ మురుగంతా పొంగి రోడ్లపై ప్రవహిస్తోంది. సింగ్‌నగర్‌లోని మజ్జిద్-ఈ-మనూర్ మస్జీద్ ముందు మ్యాన్‌హోల్ నుంచి మురుగంతా రోడ్లపై ప్రవహిస్తోంది. దీంతో కనీసం మస్జీద్‌లోకి వెళ్లి ప్రార్థన చేసుకునేందుకు కూడా వీలులేకుండా పోతుందని స్థానిక ముస్లింలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సింగ్‌నగర్ పీఅండ్‌టీ కాలనీ, నందమూరినగర్, డాబాకొట్లు సెంటర్, గంగానమ్మగుడి ఎదురు రోడ్లలో కూడా అనేక చోట్ల ఇదే విధంగా మ్యాన్‌హోల్స్ పొంగి రోడ్లపై ప్రవహిస్తున్నాయి.



షెల్ హాస్పటల్ రోడ్డులో ఇదీ పరిస్థితి

డంపింగ్ యార్డుల్లా ప్రధాన కూడళ్లు



బీజేపీ ఆఫీస్ ఎదురు రోడ్డులో పేరుకుపోయిన చెత్త

స్థానిక 57, 58, 59తో పాటు 60 నుంచి 64వ డివిజన్లలోని ప్రధాన కూడళ్లు డంపింగ్ యార్డ్‌లను తలపిస్తున్నాయి. వర్షాలు పడుతుండటంతో ఆ చెత్త అంతా రోడ్లపైకి చేరి ఇళ్లల్లోకి వచ్చేస్తుందని స్థానికులు గగ్గోలు పెడుతున్నారు. కనీసం కాంట్రాక్టు పద్ధతిలో కార్మికులనైనా ఏర్పాటుచేసి పరిష్కార మార్గం చూపాల్సిన ప్రభుత్వం, సంబంధిత ఉన్నతాధికారులు తూతూమంత్రంగా చర్యలు చేపట్టి చేతులు దులుపుకొంటున్నారని ఆరోపిస్తున్నారు. ఎమ్మెల్యే, కూటమి నాయకులు చెప్పిన చోట్ల తప్ప మిగిలిన ప్రాంతాల్లో పారిశుద్ధ్య చర్యలు చేపట్టడం లేదని మండిపడుతున్నారు. జ్వరాలు, వ్యాధులు ప్రబలి తమ ఆరోగ్యాలు దెబ్బతినకముందే సంబంధిత ఉన్నతాధికారులు వీటి భారి నుంచి తమకు విముక్తి కలిగించాలని స్థానికులు ప్రాధేయపడుతున్నారు.



సింగ్‌నగర్‌లోని మస్జీద్ ముందు ప్రవహిస్తున్న మురుగు

దుర్గమ్మ దర్శనం సులభతరం చేయడమే లక్ష్యం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): సుదూర ప్రాంతాల నుంచి విచ్చేసే భక్తులు అమ్మవారి దర్శనంలో ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని ఈవో శీనానాయక్ పేర్కొన్నారు. దుర్గగుడి పరిసరాల్లో ఈవో శీనానాయక్, వెస్ట్ ఏసీపీ దుర్గారావు, వన్‌టౌన్ సీఐ గురుప్రకాష్, ట్రాఫిక్ పోలీసు అధికారులు మంగళవారం క్షేత్రస్థాయిలో పర్యటించారు. దుర్గాఘాట్‌ను పరిశీలించిన అధికారులు అక్కడ చేపడుతున్న పలు అభివృద్ధి పనులపై చర్చించారు. నదీతీరానికి పుణ్యస్నానాలకు విచ్చేసే భక్తులు తమ లగేజీ, సెల్‌ఫోన్లు, చెప్పులను భద్రపరుచుకునేందుకు కౌంటర్లు ఏర్పాటు చేయనున్నామన్నారు. అదేవిధంగా భక్తులు మెయిన్‌రోడ్డుపై నుంచి నడిచి వెళ్లి ప్రమాదాల బారీన పడకుండా అండర్ గ్రౌండ్ ద్వారా వెళ్లేలా చర్యలు తీసుకుంటున్నట్లు ఆలయ ఇంజినీరింగ్ అధికారులు పేర్కొన్నారు. కనకదుర్గానగర్, చైనా వాల్, విజయేశ్వర ఆలయం వద్ద వాహనాల పార్కింగ్ గురించి చర్చించారు. నూతన ప్లాన్ అమలు చేయడం వల్ల ఘాట్‌రోడ్డుపై రద్దీని నియంత్రించడంతో పాటు లిఫ్ట్ ద్వారా వెళ్లే భక్తులకు సులభంగా అమ్మవారి దర్శనం అవుతుందన్నారు. మాస్టర్ ప్లాన్ ప్రకారం చేపట్టిన యాక్షన్ ప్లాన్‌ను అమలు చేసేందుకు ఈ నెల 25, 26వ తేదీల్లో ట్రయల్ రన్ నిర్వహించాలని అధికారులు నిర్ణయించారు. ఈవో వెంట దుర్గగుడి ఇంజినీరింగ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.